క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రం

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించే కానిస్టేబుల్ నియామకాల రాత పరీక్ష కేంద్రం (కోడ్ నంబర్ 6833) ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మైలవరం సెంటర్‌లో 240 మంది అభ్యర్థులు 22వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులను ఉదయం 9గంటలకు నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. అభ్యర్థులు తమతో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు ఆధార్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటు గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకురావాలన్నారు.

ఏఎంసీపై ఆరోపణలు అవాస్తవం

మైలవరం: స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో సిబ్బంది మందు పార్టీ చేసుకున్నట్లు వస్తున్న ఆరోపణలు వాస్తవం కాదని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. కొంత మంది కావాలనే ఏఎంసీపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నరన్నారు. వాస్తవానికి ఈ సంఘటన 2021లో జరిగినట్లు తెలిసిందని, అప్పట్లో సంబంధిత సిబ్బందిని నాటి చైర్మన్ హెచ్చరించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరోపణలు వస్తున్న సంఘటనపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వచ్చి విచారణ జరిపారని, రికార్డులు పరిశీలించడం జరిగిందని, ఈ పరిశీలనలో 2021లో జరిగినట్లు తెలిసిందన్నారు. నాటి సంఘటనను ఇప్పుడు తెరపైకి తీసుకువచ్చి ఏఎంసీ కమిటీపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారని చైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు

తిరువూరు: స్థానిక శ్రీనిధి స్కూల్ విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రోడ్డుపై రాకపోకలు సాగించేటపుడు అనుసరించాల్సిన నిబంధనలు, ప్రమాదాలు జరగకుండా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, మొబైల్ మాట్లాడకుండా డ్రైవ్ చేయడం తదితర జాగ్రత్తలను రవాణా అధికారి రవి తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, కరస్పాండెంట్ కిశోర్ పాల్గొన్నారు.

రేపు యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

తిరువూరు: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఈ నెల 22న నందిగామలో జరుగుతుందని జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశ కరపత్రాలను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంక్షేమానికి కృషి చేస్తున్న యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ప్రతి సభ్యుడూ విచ్చేసి జయప్రదం చేయాలని శ్రీనివాస్ కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు అపర్ణ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ముత్తయ్య, వినయ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు వసూలు చేయాలి



తిరువూరు: పట్టణంలో ఆస్తి పన్ను బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నగరపంచాయతీ కార్యాలయంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, సచివాలయ అడ్మిన్లతో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాలపై సమావేశం నిర్వహించారు. ఇకపై పట్టణంలో నిర్మించే ప్రతి ఇంటికీ ముందుగా ప్లాన్ ఆమోదం పొందాలని, అనుమతి లేని కట్టడాలకు వెంటనే నోటీసులు జారీచేయాలని కమిషనర్ ఆదేశాలిచ్చారు. ఇన్‌చార్జి టీపీవో వెంకయ్య, ఆర్‌ఐ విజయ్ పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (దోస్త్ 1987–90) వితరణతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయిని లక్ష్మి తెలిపారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు విగ్రహావిష్కరణ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు మేడూరి రవిశంకర్, పరసా నెహ్రూజీ, చిత్తలూరి సోమశేఖర్, బిరుదురాజు రవికుమార్, గోపీ, రమేష్, శారదారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చాట్రాయి: మండలంలోని కోటపాడు, చీపురుగూడెం, పోలవరం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు.

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన



నెక్కలం గొల్లగూడెంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ ముద్రించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించారు. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. గతంలో జన్మభూమి కమిటీలతో టీడీపీ వారికే సంక్షేమ పథకాలు అందేవన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లతో నేరుగా సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఇంటివద్దకే అందిస్తున్నామని పేర్కొన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, వైఎస్సార్ చేదోడు, జగనన్న తోడు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను అందిస్తు దేశంలోనే అగ్రస్థానంలో సీఎం జగన్ రాష్ట్రాన్ని నిలిపారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ మచ్చా హరిబాబు, సర్పంచి లింగవరపు రమేష్, ఎంపీటీసీ గుర్రం శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పటాపంచల గోపాలరావు, నాయకులు నెక్కళపు కృష్ణ, గజగంటి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఉదయ్‌భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి

మైలవరం: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలలో మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డి. సీతయ్య, బి. రిషినాయక్ ఫాయల్ విభాగంలో ప్రతిభ కనబర్చి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శ్రీరామమూర్తి తెలిపారు. మైలవరం వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18, 19 తేదీలలో నంద్యాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్–19 ఫెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీరామమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఫెన్సింగ్ పోటీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ఇదే పోటీల్లో మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు డి. రామ్ ప్రసాదరావు తెలిపారు. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. గంగాధర్, యు. అజయ్‌కుమార్, టి. సాయికృష్ణ, ఎస్. ఈశ్వర్ చైతన్య, పి. హరిచరణ్‌లుపతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ఇన్‌చార్జి హెచ్ ఎం రామ్‌ప్రసాదరావు, వ్యాయామోపాధ్యాయులు కె. వెంకయ్య, జి. మెర్సీ రోజీనా అభినందించారు.

రైతులకు అందుబాటులో వర్మీ కంపోస్టు



రైతుకు వర్మీ కంపోస్టు ఎరువు అందజేస్తున్న సర్పంచ్ ధర్మరాజు, కార్యదర్శి కోటేశ్వరరావు

వెల్వడం(మైలవరం): రైతులకు అందుబాటులో వర్మీ కంపోస్టు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ పి. ధర్మరాజు తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామ సచివాలయంలో శుక్రవారం వర్మీ కంపోస్టు బ్యాగ్‌ల అమ్మకాలను ప్రారంభించారు. రసాయనిక ఎరువుల కన్నా సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని, ఎక్కువ దిగుబడి వస్తుందని తెలిపారు. సేంద్రియ ఎరువులు తక్కువ ధరతో లభిస్తుందన్నారు. గ్రామంలో లభించే చెత్తా చెదారాన్ని పంచాయతీ కార్మికులు సేకరించి యంత్రాల ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేస్తారన్నారు. పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ వర్మీ కంపోస్టు ఎరువు కిలో కేవలం రూ.10 మాత్రమే అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

పాఠశాలల్లో ‘బేటీ బచావో బేటీ పడావో’



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బేటీ బచావో బేటీ పడావో (ఆడపిల్లలను రక్షించండి ఆడపిల్లలను చదివించండి) కార్యక్రమాన్ని కొండపల్లి, కేతనకొండ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈలప్రోలు సెక్టార్‌లో కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల, కేతనకొండ సెక్టార్‌లో కేతనకొండ జూనెట్ పాఠశాలలో బాలికలకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సూపర్ వైజర్ జి.రమాదేవి బాలికల విద్య ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిర్మూలన, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికల అక్రమ రవాణా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పడావో పథకం లక్ష్యాలను వివరించారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

పుట్రేల జెడ్పీ పాఠశాలలో..

విస్సన్నపేట: బాలికలు పౌష్టికాహారం తీసుకోవటం వల్ల ఆరోగ్యం మంచిగా ఉంటుందని సీడీపీఓ లలిత కుమారి అన్నారు. మండలంలోని పుట్రేల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పదోతరగతి బాలికలకు ఆరోగ్యానికి సంబంధించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలకు అధిక ధరలు

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మంచి డిమాండ్ ఉందని ఆ శాఖ జిల్లా కో ఆర్డినేటర్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చాట్రాయిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు లభిస్తున్న ధరలపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల ద్వారా పండిన పంటలను టీటీడీ మార్కెట్ ధరల కంటే 15 శాతం ఎక్కువకు కొనుగోలు చేస్తుందని.. బయట మార్కెట్‌లో కూడా మంచి ధరలకు వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం సామూహికంగా బీజామృతం తయారు చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ ఐబీ కో–ఆర్డినేటర్ సుబ్బరాజు, ప్రసాద్, మండల ఇన్‌చార్జ్ చంటిబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా రమేష్

గంపలగూడెం: యూటీఎఫ్ గంపలగూడెం మండల శాఖ అధ్యక్షుడిగా చిల్లపల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా కె. మోహనరావును ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ ముత్తయ్య, గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీను, ఉపాధ్యాక్షురాలు అపర్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు జెడ్పీటీసీకి సన్మానం

ముసునూరు: జెడ్పీటీసీగా విజయవంతంగా బాధ్యతలు నిర్వహిస్తున్న వరికూటి ప్రతాప్ మండల గ్రామ సచివాలయ కన్వీనర్‌గా నియమితులయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రతాప్‌ను శుక్రవారం మండల వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, కాట్రేనిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు కంబాల రాంబాబు సోదరులు శాలువలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు.

విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ క్యాంపు

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలకు ఆధార్ నమోదు తప్పనిసరి చేశారన్నారు. గతంలో ఆధార్ కార్డు కలిగిన విద్యార్థులు తప్పని సరిగా అప్‌డేట్ చేసుకుని ప్రభుత్వం అందించే పథకాలు పొందాలన్నారు. అనంతరం 44మంది విద్యార్థులకు గాను తొలిరోజు 29మందికి ఆధార్ అప్‌డేట్ చేశారు. హెచ్‌ఎం రెడ్‌స్టార్, ఉపాధ్యాయురాలు వాసంతి, సీఆర్పీ నాగేశ్వరరావు డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మరియ మాత ధన్యురాలు

ఆగిరిపల్లి: క్రీస్తుకు జన్మనిచ్చిన మరియమాత ధన్యురాలని ఈదులగూడెం విచారణ గురువు ఫాదర్ కరుణాకర్ పేర్కొన్నారు. మండలంలోని ఈదర సహాయమాత ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 8వ రోజు నవదిన ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్ ఆధ్వర్యంలో దివ్య పూజాబలిని నిర్వహించారు. ఈదర విచారణ గురువు రెవ.ఫాదర్ అగస్టీన్, సహాయ గురువు ప్రకాశ్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, విశ్వాసులు పాల్గొన్నారు. ఈ నెల 22, 23, 24 ఈదర సహాయమాత ఉత్సవాల్ని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఫాదర్ అగస్టీన్ తెలిపారు.

పక్కా గృహాల నిర్మాణానికి ప్రోత్సాహం

ఆంజనేయపురం(తిరువూరు): పేదలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పక్కాగృహాలను త్వరితగతిన నిర్మించుకోవాలని తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామ సర్పంచి మామిడి కుటుంబరావు కోరారు. శుక్రవారం ఆ గ్రామంలో పీఎంఏవై పథకం కింద మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణానికి సచివాలయం వద్ద మెటీరియల్ అందజేశారు. ఇసుక, ఐరన్, సిమెంటు ప్రభుత్వం సరఫరా చేస్తున్నందున పక్కాగృహాల మంజూరుకు లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి రమేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అభిషేక్ పాల్గొన్నారు.

ఎయిమ్స్ వైద్యశాలకు బస్సు నడపాలని వినతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజల సౌకర్యార్థం కొండపల్లి మునిసిపాలిటీ నుంచి మంగళగిరి ఎయిమ్స్ వైద్యశాలకు బస్సు సౌకర్యం కల్పించాలని మైలవరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ నూతలపాటి బాలకోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆర్టీసీ బోర్డ్ డైరెక్టర్, జోనల్ చైర్మన్ తాతినేని పద్మావతికి ఆమె కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అలాగే గతంలో మైలవరం నుంచి హైదరాబాద్‌కు నడిచిన బస్సు సర్వీస్ పునరుద్ధరించేందుకు ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

26 నుంచి ప్లాస్టిక్ నిషేధం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మునిసిపాలిటీ పరిధిలో పర్యావరణ కాలుష్యం నివారించి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ఈనెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ప్లాస్టిక్ కవర్లు, ఫ్లెక్సీలు వినియోగించినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విషయాన్ని మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల కోసం సచివాలయాల పరిధిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు జరిపే దుకాణదారులకు జరిమానాతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

సత్యంబాబుకు ఎమ్మెల్యే నివాళి

ఆగిరిపల్లి: మండలంలోని నరసింగపాలెంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, గ్రామ పార్టీ నాయకుడు సూరానేని పెద సత్యంబాబు(67) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం ఉదయం పెద సత్యంబాబు నివాసానికి వెళ్లి ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, గ్రామ సర్పంచి అనూష పురుషోత్తం, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పొన్నం రామచంద్రరావు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న కార్మికులు

వెల్వడం(మైలవరం): మండలంలోని వెల్వడం గ్రామ పంచాయతీలో ఇటీవల తొలగించిన 11మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వెల్వడం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్మికులను అక్రమంగా తొలగించారని, వెంటనే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శితో చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే సోమవారం నుంచి నిరాహార దీక్షలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పి. నాగేశ్వరరావు, కె. కోటేష్, పి. కోటేష్, డి. సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

తెల్లదేవరపల్లి(విస్సన్నపేట): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అనేక పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని తెల్లదేవరపల్లి సచివాలయం పరిధిలో లంబాడీ తండా, ఎస్సీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయా కుటుంబాలకు అందజేసిన సంక్షేమ పథకాలు గురించి ఎమ్మెల్యే వివరిస్తూ, బ్రోచర్లు అందజేశారు. స్థానిక సమస్యలు తెలసుకొని వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వలంటీర్ల ద్వారా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను నేరుగా గడప వద్దకే తీసుకెళ్లి అందిస్తూ ఉంటే.. దాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు కొందరు వలంటీర్లపై అనేక విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గంటల నాగాచారి, ఎంపీటీసీ చాట్ల మణి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యులు సిరసాని ప్రకాష్, అనుమోలు శివబాజీ, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, తహసీల్దార్ కె. లక్ష్మి, ఈఓపీఆర్డీ ఝాన్సీ రాణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడూ ఇదే ప్రాంతంలో..

మండలంలోని తెల్లదేవరపల్లి సచివాలయ పరిధిలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం శనివారం ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తారని ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



తుక్కులూరులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అంకబాబు, ఎస్ఐ రామకృష్ణ

నూజివీడు: రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా యువత చనిపోతున్నారని, దీనివల్ల దేశం యువశక్తిని కోల్పోతోందని పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఈ నేపథ్యంలో రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించుకుంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు చెప్పారు. 34వ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కొత్తూరులోని సీబీఎస్‌సీ స్కూల్‌లో రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు నాగమురళీ, ప్రసాద్ మాట్లాడుతూ రహదారుల ప్రమాదాల్లో ఒకరు చేసిన తప్పుకు ఏ విధమైన సంబంధం లేని మరో కుటుంబం చిన్నాభిన్నం అవుతోందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ శాగం రాధాకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ పిన్నమనేని వెంకట కుమార్, సిబ్బంది, స్కూల్ బస్సు డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని రూరల్ సీఐ ఆర్.అంకబాబు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తుక్కులూరు వై.జంక్షన్ వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టాభి నోరు అదుపులో పెట్టుకోవాలి



టీడీపీ నేత పట్టాభి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆగిరిపల్లి: టీడీపీ నేత పట్టాభి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఈదులగూడెం వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. ఇటీవల టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు వర్ధంతి కార్యక్రమానికి హాజరైన పట్టాభి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తనయుడు వేణుగోపాల అప్పారావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈదులగూడెంలో పట్టాభి దిష్టిబొమ్మకు చెప్పుల దండతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం పట్టాభి అమర్ రహే అంటూ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆరేపల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెనుముచ్చు రాంబాబు, యాదవ సంఘం అధ్యక్షుడు తేల్ల గంగాధర్‌రావు, నాయకులు వీరంకి రాఘవయ్య, కొలుసు కృష్ణ, ముల్లంగి రవి, నండూరి భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

తోటమూల(గంపలగూడెం): బాలికలు సరియైన వయస్సు వచ్చే వరకు వివాహాలు చేసుకోవద్దని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. గంపలగూడెం మండలం తోటమూల కేజీబీవీలో శుక్రవారం బాలిక దినోత్సవం సందర్భంగా గంపలగూడెం పట్టణ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. అపరిచిత వ్యక్తులతో సన్నిహితంగా మెలగవద్దని సూచించారు. బాలికలు ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురి అవుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన

ఎ.కొండూరు: మండలంలోని కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో కళాజాత బృందం వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల ప్రాథమిక వైద్యాధికారి దివిజ శుక్రవారం తెలిపారు. ఎ.కొండూరులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం వారిచే కిడ్నీ వ్యాధులు సోకటానికి గల కారణాలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజు రెండు గిరిజన తండాల్లో వారిచే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కిడ్నీ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మురళీ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ జట్లకు కోచింగ్ క్యాంప్ ప్రారంభం



నూజివీడు: ఎస్‌జీఎఫ్ అండర్–14 ఉమ్మడి కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ బాలురు, బాలికల జిల్లా జట్లకు పట్టణంలోని విక్టోరియా టౌన్‌హాల్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో కోచింగ్ క్యాంపు శుక్రవారం ప్రారంభమైంది. బాలురు, బాలికల జట్లకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నారు. బాలుర జట్టుకు కోచ్‌గా వాకా నాగరాజు, బాలికల జట్టుకు కోచ్‌గా ఎస్.లక్ష్మిలు వ్యవహరిస్తున్నారు. ఈ జట్లు వచ్చేనెల 3, 4, 5 తేదీల్లో నూజివీడులో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాయి.